రేపు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



నల్లకుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' వారి ముత్యాల ముగ్గుల పోటీలు ఈనెల 7న ముషీరాబాద్ మెయిన్ రోడ్డు మెట్రోస్టేషన్ సమీపంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. చిక్కడపల్లి జోన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందిన మహిళలు ఈ పోటీలో పాల్గొనవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతికి రూ.3 వేలు ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. ముగ్గుల రంగులు మహిళలు వెంట తెచ్చుకోవాలి. ఈ పోటీలకు ఆసక్తి గల వారు 93930 04039, 99854 11018లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం రేపు

బర్కత్‌పుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హర్రాజీపెంటలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 7న మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రసన్నాంజనేయస్వామి ఉచిత క్లినిక్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఏర్పాటై రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉచిత కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో మహిళలు చికిత్సలు పొందొచ్చని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబేద్కర్ కళాశాల చైర్మన్ సరోజవివేక్, ప్రముఖ రచయిత డాక్టర్ రాధిక కృష్ణ హాజరవుతారని తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు.



అవగాహన కార్యక్రమంలో వివిధ బస్తీలకు చెందిన మహిళలు

ఆపదలో ఉన్న మహిళల రక్షణే మా లక్ష్యం

కవాడిగూడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలకు భద్రత, రక్షణ, న్యాయసహాయం అందించడమే మహిళా పోలీస్‌స్టేషన్ లక్ష్యమని సెంట్రల్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం తెలిపారు. శుక్రవారం దోమలగూడలోని వివిధ బస్తీలు, కాలనీలలో అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు లైంగిక, శారీరక, మానసిక వేధింపులు, కుటుంబ కలహాలు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జగన్నాథం మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఐ గౌతమి, చందన మాట్లాడుతూ.. చిన్నచిన్న విషయాలకు తగాదాలు పడకుండా భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని సంతోషంగా ఉండాలన్నారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం షీటీం, భరోసా, టక్కీ సెంటర్ మహిళా పోలీస్‌స్టేషన్ ద్వారా భద్రత, రక్షణ, న్యాయసలహాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అప్సా స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు బొట్టు రమేష్, శ్రావణి, లావణ్య, వివిధ బస్తీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

రాయితీ విద్యుత్ బకాయిలు చెల్లించడం హర్షణీయం



సత్యనారాయణ

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సెలూన్‌లు, లాండ్రీషాపులు, ధోబీఘాట్‌లకు అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకం బకాయిలు చెల్లించడం హర్షణీయమని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లుల కోసం 110 కోట్ల రూపాయలు రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ ఉచిత పథకాన్ని కొనసాగిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాగుమల్ల బాలకృష్ణ, రజక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటయ్య, గ్రేటర్ అధ్యక్షుడు చిట్యాల రామస్వామి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుమారస్వామి

బర్కత్‌పుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలలో బీసీల రిజర్వేషన్లు కేవలం 23 శాతం మాత్రమే ఉన్నాయని, దీని వల్ల రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కడం లేదన్నారు. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్‌డ్రైవ్

చిక్కడపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరేశం తెలిపారు. స్టేషన్‌పరిధిలోకి వచ్చే అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాలు లేదా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి నిర్మాణాలూ చేయరాదన్నారు. కాగా డ్రంకెన్ డ్రైవ్ కేసులో నాంపల్లి 10ఎంఎం జడ్జి ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి నాలుగు రోజులు జైలుశిక్ష విధించారు.

'కిషన్‌రెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలి'

నల్లకుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాదరణను చూసి ఓర్వలేక కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో భాగంగానే ఆరు గ్యారెంటీలలో రెండింటినీ అమలు చేస్తుండగా అసలు దరఖాస్తులు లేకుండానే అమలు చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. లబ్ధిదారులైన వారికి ఈ పథకాలు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. మహాలక్ష్మి పథకంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు.

'విద్యా సంస్థల్లో మతపరమైన కార్యక్రమాలు చేయొద్దు'

నల్లకుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మతపరమైన కార్యక్రమాలు చేయడం సరైంది కాదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్ అన్నారు. విద్యా సంస్థలు సెక్యులర్ సంస్థలుగా ఉండాలని, తద్వారా విద్యార్థుల్లో జిజ్ఞాసను, ఆసక్తిని పెంచే కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలలో శ్రీరాముడి కల్యాణం నిర్వహిస్తున్నాడని తెలిపారు.

జేఎన్‌టీయూ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని లేడీస్ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లను నియమిస్తూ ప్రిన్సిపాల్ విజయకుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వు లు జారీచేశారు. పీజీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థినులు గురువారం జేఎన్‌టీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకరిని రెగ్యులర్ వార్డెన్‌గా, ఇద్దరిని అసోసియేట్ వార్డెన్లుగా నియమించారు. వీరితో పాటు డిసిప్లిన్ అండ్ మెయిటెనెన్స్ కోఆర్డినేటర్లుగా ఐదుగురు కాంట్రాక్టు అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అయ్యప్ప భక్తులకు సన్మానం

ముషీరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శబరిమలై యాత్రకు 50 మంది అయ్యప్ప భక్తులు శుక్రవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ వారిని ఘనంగా సన్మానించారు. శబరి యాత్రలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి రావాలని అన్నారు.

విద్యారంగంలో మార్పులు రావాలి

టీఎస్‌యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి తదితరులు

కవాడిగూడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు రావాలని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విశ్లేషకులు విద్యావేత్త కె.నాగేశ్వర్ అన్నారు. దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేజీ టు పీజీ విద్యపై హామీ ఇచ్చి విద్యారంగానికి కేటాయింపులు పెంచకుండా ప్రభుత్వ విద్యను అస్తవ్యస్తం చేసిందని ఆరోపించారు. అందరికీ నాణ్యమైన, గుణాత్మక విద్యనందించే వైపు నూతన ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అందుకోసం నూతన ప్రభుత్వం తన మెనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. తలసరి ఆదాయం పెరిగిందని, చెప్పుకునే ముందు ఆర్థిక, సామాజిక అంతరాలు గమనించాలన్నారు. విద్యాసంస్థల్లో చదువుల్లో సమానత్వం సాధిస్తేనే సమాజంలో సమానత్వం సాధించొచ్చని అన్నారు. పాఠశాల, ఉన్నత విద్య ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ ఎల్.అరుణ, కమలకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎ.సింహాచలం, గాలయ్య, కొండల్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నాయకులు రాజారావు, శ్యామ్, జగన్నాథ్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రికలు రాజకీయాల మధ్య బంధాలు పెరిగాయి..



మాట్లాడుతున్న బుద్ధ మురళి పక్కన కళాజనార్దనమూర్తి

చిక్కడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పత్రికలకు, రాజకీయాలకు మధ్య సంబంధం సామాజిక, దేశ ప్రయోజనాల కోసం ఉండేవని, నేడు ఆర్థిక అవసరాల కోసంగా మార్పు చెందాయని రాష్ట్ర సమాచార హక్కుచట్టం మాజీ చీఫ్ కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. షోయబుల్లాఖాన్ పత్రికా రచయితగా నిజాం అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి రజాకార్ల ఆగ్రహానికి గురై హత్యకు గురయ్యారన్నారు. త్యాగరాయగానసభలో దశాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా షోయబుల్లాఖాన్ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ మురళి మాట్లాడుతూ.. గతంలో గాంధీ, నేతాజీ ప్రకాశంపంతులు వంటి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు పాత్రికేయరంగంలో ఉన్నారన్నారు. షోయబుల్లాఖాన్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో పుట్టిన షోయబుల్లాఖాన్ ఓయూలో ఉన్నత విద్య చదివి నిజాంను ధిక్కరించారని వివరించారు. ప్రజాసేవకుడు వైకుంఠం, గానసభ పాలకవర్గ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

'ఉద్యమకారులను స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలి'

బర్కత్‌పుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 10 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించాలని ఫోరం విజ్ఞప్తి చేసింది. ఉద్యమకారుల ఆత్మగౌరవం సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంట్ నియోజకవర్గాలలో సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.సురేందర్‌రెడ్డి, సలహాదారులు డాక్టర్ షోయబ్, ప్రతినిధులు యాలల మహేశ్వర్‌రెడ్డి, కలకోట రాములు, జి.వెంకటేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, తాడూరి జగన్‌కుమార్, జంగా సుదర్శన్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. పెన్షన్, ఉచిత బస్, రైలు పాసు, ఆరోగ్యశ్రీకార్డు, 20 లక్షల జీవిత బీమా కల్పించాలని కోరారు, నిరుద్యోగులకు 50 లక్షల వడ్డీలేని రుణాన్ని ఇవ్వాలని, విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగాల భర్తీలో 20 శాతం కోటా కేటాయించాలన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉద్యమకారులందరూ అండగా ఉంటారని వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీ కులగణన చేపట్టాలి

● 29, 30వ తేదీల్లో చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి ● ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలోపే కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ కూడా బీసీ కులగణనపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే దేశంలోని 75 కోట్ల మంది బీసీలు బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలని, బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన హెచ్.వెంకటేశ్వరిణికి ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు కోట్ల శ్రీనివాస్, వేముల రామకృష్ణ, టి.సుధాకర్, నందగోపాల్, జి.కృష్ణయాదవ్, మట్ట జయంతిగౌడ్, పృథ్వీగౌడ్, కమలాకర్, బలరాం పాల్గొన్నారు.



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో వైద్యులు

పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం కీలకం

● ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఆస్పత్రి పర్సనలైజ్డ్ మెడిసిన్ ప్రామాణిక అభ్యాసంగా మారాలని, అందరికీ కచ్చితమైన, సమర్థవంతమైన, సరసమైన పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం అనేది కీలకమని ఏఐజీ ఆస్పత్రి చైర్మన్, గ్యాస్ట్రోఎంటరాలజీ చీఫ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఉప్పలూరి-హెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్సనలైజ్డ్ మెడిసిన్‌పై పరిశోధనలు జరగాలన్నారు. డాక్టర్ వినయేందర్ తుల్లా మాట్లాడుతూ జెనీకనెక్ట్ ఆర్ఎ 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్' జన్యు సమాచారాన్ని డీకోడ్ చేయడం ద్వారా డ్రగ్ డిస్కవరీలో విప్లవాత్మక మార్పులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ ఉప్పలూరి, హిమ చల్లా, ఏఐజీ ఆస్పత్రుల వైస్ చైర్మన్ పెన్మెత్స వెంకటసుబ్బరాజు, సీఎస్ఐఆర్ విశిష్ట శాస్త్రవేత్త, మాజీ డైరెక్టర్, సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ప్రొఫెసర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

నేటితో ప్రజాపాలన ముగింపు

అంబర్‌పేట నియోజకవర్గంలో 74,747 దరఖాస్తులు



చాచానెహ్రూ కమ్యూనిటీహాల్‌లో దరఖాస్తులు అందజేస్తున్న దిడ్డి రాంబాబు

బర్కత్‌పుర/నల్లకుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఐదు గ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు బారులుతీరుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో అధికారులు 20 సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు గడువు నేటితో ముగియనుండడంతో శుక్రవారం సెంటర్ల వద్దకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 20 సెంటర్లలో 7,715 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో అభయహస్తం కింద 5,259, ఇతర సమస్యలపై 2,617 దరఖాస్తులు వచ్చాయని డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. ఇప్పటి వరకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి 74,747, అభయ హస్తం కింద 58,039, ఇతర సమస్యలపై 17,482 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈనెల 6వ తేదీ శనివారంతో ప్రజాపాలన కార్యక్రమం ముగియనుందని ఆయన తెలిపారు.

రాంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ఈనెల 6వ తేదీతో ముగుస్తుందని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి(30) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడి ఒంటపై బూడిద రంగు టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ధరించి ఉన్నట్లు తెలిపారు.

ప్రదీప్‌కుమార్ రంగస్థల సేవలు ప్రశంసనీయం



అర్ధశతాబ్ది వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆరున్నర దశాబ్దాలుగా రంగస్థల నటుడిగా, దర్శకుడిగా విశేష సేవలు అందిస్తున్న ప్రొ.ప్రదీప్‌కుమార్ నాటకరంగ పరిరక్షణలో అగ్రస్థానంలో నిలిచారని ప్రముఖ వక్తలు ప్రశంసించారు. త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి ఓయూ తులసిభవన్‌లోని సాంస్కృతిక పరిశోధనా కేంద్రం అర్ధ శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ సిటీకాలేజ్ ప్రిన్సిపాల్ బాలభాస్కర్, రంగస్థల ప్రముఖులు డా.కొట్టె వెంకటాచార్యులు, ప్రొ.సక్కుభవ్య, భవాని, అశోక్, సుతారపు వెంకటనారాయణ, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొని ప్రదీప్‌కుమార్ సాంస్కృతిక కేంద్రం సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహించడం విశేషమన్నారు. ఎనభై పైబడిన వయస్సులోనూ నిర్విరామంగా నటిస్తూ యువతకు నటనలో శిక్షణ ఇస్తున్నారన్నారు. హనుమంతరావు స్వాగతం పలుకగా డా.వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధేంద్ర కళాక్షేత్ర డా.సుధాకర్, డా.రత్నశ్రీ శిష్య బృందం కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ 1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. గగన్‌మహల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కట్టమైసమ్మ ఆలయం, బరాక్‌బాగ్, సాధురామ్ కంటి ఆస్పత్రి, ఎంసీహెచ్ డంప్‌యార్డ్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

హిమాయత్‌నగర్ స్పెషల్ ఆర్ఐ ఆకస్మిక మృతి



మహేష్‌రాజు(ఫైల్)

అంబర్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్ మండలంలో స్పెషల్ ఆర్ఐగా పని చేస్తున్న బి.వి.మహేష్‌రాజు(40) శుక్రవారం మృతి చెందారు. అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న మహేష్‌రాజు హిమాయత్‌నగర్ మండలంలో స్పెషల్ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట మండలంలో పనిచేసిన ఆయన ఇటీవల బదిలీపై హిమాయత్‌నగర్ మండలానికి వెళ్లారు. మహేష్‌రాజు గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మహేష్‌రాజు అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం కాచిగూడలోని హర్రాజీపెంట హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు.

● సమస్య పరిష్కరించాలి



దయార మార్కెట్‌లో చెడిపోయిన మ్యాన్‌హోల్ సమస్యను జలమండలి అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి అధికారులకు సూచించారు. శుక్రవారం మార్కెట్‌లో ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంరెడ్డి, బస్తీవాసులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

అయోధ్య అక్షింతల ఊరేగింపు



ఊరేగింపులో డా.లక్ష్మణ్, పావనివినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతలు ప్రత్యేకపూజల అనంతరం ఊరేగింపు శుక్రవారం గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మొదలైంది. డా.లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అక్షింతల ఊరేగింపులో పాల్గొని అశోక్‌నగర్‌లోని ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఐదొందల సంవత్సరాల తర్వాత ఎంతో మంది ఆత్మబలిదానాల అనంతరం హిందూధర్మ విజయానికి ప్రతీకగా అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తయిందన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నేతలు ఉమేష్, శ్రీకాంత్, సురేందర్, సురేష్, ప్రకాష్, లక్ష్మణ్, శివకుమార్, సంతోష్, యాదగిరి, తులసి, రామారావు, పాల్గొన్నారు.

● బర్కత్‌పుర: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జనవరి 22 దేశ చరిత్రలో కీలకఘట్టం కానున్నదని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, నాయకులు పూస రాజు, మహిపాల్‌రెడ్డి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్: అయోధ్య నుంచి రాంనగర్ రామాలయానికి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు, దేవాలయ ఫొటోలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రాంనగర్ రామాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ డి.రవియాదవ్ ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు పాల్గొన్నారు.

● ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో అయోధ్య అక్షింతల ఊరేగింపు శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్, నరేష్, రాహుల్, అజయ్, శశాంక్, వెంకట్, ఉదయ్, మణి, బన్ని తదితరులు పాల్గొన్నారు.



పూర్ణిమను సత్కరిస్తున్న యూసుఫ్, బాలనాగు తదితరులు

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు హైదరాబాద్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ హైదరాబాద్ రీజియన్ మేనేజర్లు యూసుఫ్, బాలనాగు కోరారు. శుక్రవారం రాంనగర్ శాఖ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పూర్ణిమ పదవీవిరమణ కార్యక్రమం బ్యాంకు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు ఆమెను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాంనగర్ బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలందించిన పూర్ణిమ అభినందనీయురాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజ్‌కుమార్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రాంచందర్, సిబ్బంది మహేశ్వర్, నాగదాస్, వినోద, ఖాతాదారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో మనోవిజ్ఞాన సదస్సు హర్షణీయం

చిక్కడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో మొట్టమొదటిసారి మనోవిజ్ఞాన సదస్సు నిర్వహించడం హర్షణీయమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీకేర్‌లో శుక్రవారం ఆమె ఈ సందర్భంగా ఈనెల 5, 6, 7 తేదీల్లో రాజమండ్రిలో జరిగే మహాసభల్లో నిర్వహించే మనోవిజ్ఞాన సదస్సు పోస్టర్‌ను పలువురు మహిళా సైకాలజిస్టులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 7న మనోవిజ్ఞాన సదస్సు జరుగుతుందన్నారు. స్వరూపరాణి, జ్యోతిరాజా, కృష్ణవేణి, మాధవి, నాగలక్ష్మి, శోభారాణి, సుజాత పాల్గొన్నారు.



నెవర్ ఎండ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాకవి జయరాజు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

నెవర్ ఎండ్ పుస్తకావిష్కరణ

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 40 ఏళ్లుగా యువజన ఉద్యమంలో ప్రాణం త్యాగం చేసి అమరులైన వీరుల చరిత్రపై ఎం.విప్లవకుమార్, ఎ.విజయ్‌కుమార్ రాసిన 'నెవర్ ఎండ్' వీరులకు మరణం లేదు పుస్తకావిష్కరణ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, ప్రజాకవి జయరాజులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యువజన ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారి చరిత్రను తెలుసుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా 820 కిలో మీటర్లు మోటారు సైకిల్‌పై యాత్ర చేసి ఈ పుస్తకాన్ని రాసిన ఎం.విప్లవకుమార్, ఎ.విజయ్‌కుమార్ అభినందనీయులన్నారు. కార్యక్రమానికి భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కవులు యాకుబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, తాగుళ్ల గోపాల్, ఆనగంటి వెంకటేష్, దాసరి యువరాణి, సాత్విక తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆకట్టుకున్న డ్రాయింగ్ అండ్ పెయింటింగ్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అభ్యస్- 7 శీర్షికన ప్రముఖ చిత్రకారులు నరేంద్రరాజ్ నేతృత్వంలో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శితమైంది. జాయింట్ జనరల్ సెక్రటరీ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తస్నీరు శ్రీనివాస్ ఈ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై తిలకించారు. కార్యక్రమంలో జి.వై.గిరి, డాక్టర్ రామ్‌కుమార్ తివారీ, కాళి కొండూరి, చిప్పా పాల్గొన్నారు.